కథ

# రిశ్తే

సయ్యద్ గఫార్
81432 53116

''ఉమేర్.. పొద్దు శానెక్కింది! ఉఠో బేటా! గీ దినం జుబేర్ మామ వస్తాడన్నవ్ కదా! లేవు మరి!'' నిద్ర లేపుతున్నది అమ్మి. జుబేర్ మామ పేరు ఇనంగనే.. గూడు ఇడ్సిన కాకి లెక్క ఎగిరివోయింది నిద్ర. నిన్న శివ రాత్రి.. దోస్తులతో కల్సి తెల్లార్లూ జాగారం జేసిన. కండ్లు మంటగున్నయి.

''జరసేపాగి లేస్తతీ అమ్మీ!'' అన్చెప్పిన.

కొన్ని రక్త సంబంధాలు ఉన్నా లేనట్టే ఉంటయి. జుబేర్ మామ ఆ బాబతోడే. అమ్మమ్మ వాళ్లకు జుబేర్ మామ, అమ్మీ.. ఇద్దరే సంతానం. మా తాత ఊరి చౌరస్తల సైకిల్ పంచర్లు ఏసే పనిచేసేటోడంట. ఆ పని చేస్కుంటనే మామను డిగ్రీ దాకా సద్వించినడంట. ఆరు సదివిన అమ్మిని దూరపు సుట్టమైన మా అబ్బుకిచ్చి పెళ్లి జేసినడంట. ఖాళీగా ఉన్న జుబేర్ మామ జాబ్ ప్రయత్నం చేస్తున్నడంట. ఆ టైంలనే నల్గొండ జిల్లాస్థాయి 'ఇస్తెమా' జరుగుతుంటే..

'ఇస్తెమాకు వోయి నల్గొండలనే ఏదన్న పని సూస్కుంట!' అన్చెప్పి నల్గొండకు వోయిన మామ.. బాయిలేసిన రాయిలెక్క గాయబ్ అయినడంట. చేతికొచ్చిన కొడుక్కు ఏం జరిగిందో తెల్వక అమ్మమ్మ – తాత శాన గుబులువడ్డరంట. చాన్నాళ్ల తర్వాత మామ నల్గొండల ఎవరో ఆస్తిపరుల ఇంటికి ఇల్లటం అల్లుడుగ వోయిండని ఎర్కయింది. అత్తగారోల్లే గవర్నమెంటు కొలువుగుడా ఇప్పించినరంట. కొన్నాళ్ల తర్వాత అడపాదడపా వచ్చివోయేటోడంట గనీ, తల్లితండ్రిని బాధ్యతగా సూస్కున్న పాపాన వోలేదంట. కొడుకు మనాదిలనే నౌశి మంచానవడి ఏడాది తేడాతో తాత – అమ్మమ్మ సచ్చివోయినరంట.

ఐదు పూటల నమాజ్ సద్వే మామ ఎందుకిలా మారిండో ఎవల్లకర్థం కాలే. అమ్మమ్మ – తాత వాళ్లు సచ్చివొయినప్పుడు వచ్చివొయిన మామ.. తిరిగి ఊరి ముఖం సూశ్లే.

* * *

మా అమ్మికి నేను, చెల్లెలు నాజియా ఇద్దరమే పిల్లలం. నాజియా పది చదివింది. నేను డిగ్రీ ఫస్ట్ ఇయర్లో ఉన్నప్పుడే నాజియా పెళ్లయి అత్తారింటికి వొయింది. పేదోల్ల సంతోషాలు సూసి కాలం గుడా ఓర్వదేమో అన్పిస్తది. చెల్లె పెళ్లయి ఏడాది గడవక ముందే అబ్బు నడిపే ఆటోను లారీ గుద్ది, విధి అబ్బును మానుంచి దూరం చేసింది. పుట్టెడు దుఃఖంల మునిగివొయింది మా కుటుంబం. మా పక్కింటి నర్సమ్మ పెద్దమ్మనే మాకు పెద్ద దిక్కయింది. అబ్బు అంతిమ కార్యక్రమాలైందాక అమ్మకు దగ్గరుండి ధైర్యం చెప్తుండింది నర్సమ్మ పెద్దమ్మనే. మామ దూరపోనిలెక్కనే వచ్చివొయిండు. యాక్సిడెంట్ చేసిన లారీ పత్తా దొరకలేదు. అబ్బులేని బాధ ఒక దిక్కయితే.. అసలు బతుకుడెట్లా అనే గుబులు ఇంకో దిక్కు.

'నూ పెద్ద సద్వులు సదివి గవర్నమెంటు కొలువు చేయాలె బేటా!' అనేటోడు అబ్బు. అందుకే నాకు డ్రైవింగ్ నేర్పలే. చెల్లె పెళ్లికి అబ్బు చేసిన అప్పుంటే.. ఆటో అమ్మి తీర్చినం. ఇల్లు గడవడం కష్టమైంది. నేను కాలేజీ మానేసిన. అది తెల్సిన నా దోస్తులు మహేశ్, జార్జి ఇంటికొచ్చి..

''ఉమేర్! మాకు సదువబ్బక ఆటోలు నడ్పుకొంటున్నం! నూ మంచిగ సదూతవ్ గదరా! కాలేజీ మానెయ్యకు! నీకు డ్రైవింగ్ నేర్పించి లైసెన్స్ ఇప్పిస్తం! పార్ట్ టైం ఆటోలు నడుపుకొంట డిగ్రీ కంప్లీట్ జేస్కో!'' అన్నరు.

నాకు కొండంత ధైర్యమొచ్చింది. వాళ్ల ఆటోలనే కాలేజీకి పోతూ వస్తూ డ్రైవింగ్ నేర్చుకున్న. డ్రైవింగ్ లైసెన్స్ వాళ్లే ఇప్పిచ్చింరు. బతుకు భయం వోయింది. నేనిప్పుడు డిగ్రీ ఫైనల్ ఇయర్.

* * *

ఈ ఏడుగుడా నల్గొండల సాలానా ఇస్తెమా జరుగుతుంటే నేను వోయిన. ఆడ జుబేర్ మామ అగువడ్డడు.

''సలాం!'' చేసిన.

''అమ్మి బాగుందా?'' అనడిగిండు.

''మంచిగనే ఉంది మామ!'' అన్చెప్పిన.

''ఏం పని చేస్తున్నవ్?'' అనడిగిండు.

